## కేటీఆర్‌ను కలిసిన విద్యార్థి విభాగం నాయకుడు క్రాంతి



కేటీఆర్‌కు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థి విభాగం సర్కిల్ అధ్యక్షుడు క్రాంతి


రామచంద్రాపురం, డిసెంబర్ 24 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సర్కిల్ అధ్యక్షుడు వాలేశెట్టి క్రాంతి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో గూడెం మహిపాల్ రెడ్డి విజయానికి విద్యార్థి విభాగం నుంచి బాగా పని చేసినందుకు మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారని క్రాంతి తెలిపారు.

## జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**



సిద్దిపేట టౌన్, డిసెంబర్ 24 : ప్రేమా భావం, సేవాతత్పరతను క్షమా గుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సంతోషంగా జరుపుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రజలు, క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అన్నారు. క్రిస్మస్ పండుగ వేళ అందరికీ శుభం కలగాలని ఏసు ప్రభును ప్రత్యేకంగా ప్రార్థించారు. క్రీస్తు దీవెనలు అందరికీ చేకురాలని.. ప్రతిఒక్కరూ ఆనందంగా జీవించాలని ఆ ప్రభువును వేడుకున్నారు.



మల్లన్న ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల సందడి

## భక్తజన సంద్రం

- కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న 25వేల మంది భక్తులు
- బోనాలు తీసి..ముడుపులు కట్టిన భక్తజనం

చేర్యాల, డిసెంబర్ 24 : కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. మల్లన్న మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 25వేల మంది భక్తులు ఆలయానికి వచ్చినట్లు ఈవో అలూరి బాలాజీశర్మ తెలిపారు. భక్తులు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టారు. కొండపై ఎల్లమ్మను దర్శించుకోవడంతోపాటు మట్టి పాత్రలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గుపూజారులు పాల్గొన్నారు. కరీంనగర్‌కు చెందిన మల్లన్న భక్తులు పెద్ది అమర్‌నాథ్, సుచిత్ర దంపతులు మల్లికార్జునస్వామికి కానుకగా లక్షా 29వేల విలువ గల బంగారు కోరమీసం ఏఈవోకు అందజేశారు.

## ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు



పూజలు అందుకుంటున్న వనదుర్గా భవానీమాత

పాపన్నపేట, డిసెంబర్ 24: ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో ఆదివారం పెద్దఎత్తున భక్తుల సందడి నెలకొంది. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని వరుస సెలవులు రావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దుర్గామాతను దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్ కుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్, యాదగిరి ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్ పూజలు నిర్వహించారు.



క్యూలైన్‌లో భక్తుల సందడి









రాష్ట్ర సచివాలయంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గం, ఉన్నతాధికారుల సమావేశంలో పాల్గొన్న మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీస్ బాస్‌లు

# చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

- అపరాలు...ఆరోగ్యకరం
- ప్లాస్టిక్‌ను నివారించేందుకు గట్టి చర్యలు
- కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి కమల్ వర్ధన్‌రావు



పటాన్‌చెరు మండలం కర్ధనూర్‌లో మాట్లాడుతున్న కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి కమల్ వర్ధన్‌రావు

పటాన్‌చెరు, డిసెంబర్ 24 : చిరుధాన్యాలు ఆరోగ్యాన్నిస్తాయిని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి కమల్‌వర్ధన్‌రావు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యాత్రలో భాగంగా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అందరి ఆరోగ్యాలకు భరోసా కల్పించే అభా కార్డులు తీసుకోవాలని ప్రజలను కోరారు. రూ.5లక్షల వరకు చికిత్స ఉచితంగా లభిస్తున్నదన్నారు. చిరుధాన్యాల వాడకం పెరగాలన్నారు. మిల్లెట్స్ సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ మిల్లెట్స్ ఇయర్‌గా గుర్తించడంతో మిల్లెట్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 14.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చిరుధాన్యాలు దేశంలో పండుతున్నాయని, వాటిని 25 మిలియన్ మెట్రిక్ టన్నులుగా పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

ఆరోగ్యం, విద్యపై గ్రామీణ ప్రజలు శ్రద్ధ పెట్టాలని సూచించారు. రెండు నెలలకోసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. యూరియా వాడకంతో ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయన్నారు. సుక్ష్మపోషకాలను వాడి పంటలను పండించాలని కోరారు. కర్ధనూర్ అభివృద్ధికి మారుపేరులా ఉందని కొనియాడారు. కర్ధనూర్ సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామాన్ని పారిశుధ్యంలో అగ్రస్థానంలో ఉంచామన్నారు. రాష్ట్రస్థాయి అవార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీపీవో సురేశ్‌మోహన్, డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, డీఎల్‌పీవో సతీశ్‌రెడ్డి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, ఉపసర్పంచ్ వడ్డే కుమార్, శ్రీరామ్ సుధాకర్, సాయికిరణ్, మోహ న్, గోపీ నాయడు, బాలూనాయక్ పాల్గొన్నారు.

### కొండాపూర్ దవాఖానలో సేవలు భేష్

కొండాపూర్, డిసెంబర్ 24 : కొండాపూర్ ప్రభుత్వ దవాఖానలో సేవలు బాగున్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి కమల్‌వర్ధన్‌రావు కితాబునిచ్చారు. ఆదివారం కొండాపూర్‌లో వికసిత్ భారత్ యాత్ర, పీఎం రూరల్ వెల్ఫేర్ స్కీమ్ కార్యక్రమంలో భాగంగా దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడగగా, బాగున్నాయని మండల వైద్యాధికారి రేష్మా అంజూమ్ వివరించారు. నూతనంగా కొండాపూర్‌కు ప్రభుత్వ భవనం మంజూరు చేయాలని కోరారు. విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట మండల ఆర్ఐ రాజు, డాక్టర్ వెంకటేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.



కొండాపూర్ మండల వైద్య సిబ్బందితో కేంద్ర అధికారులు

# మంచుకురిసే వేళలో..

- రోడ్లను కమ్మేసిన పొగమంచు
- ఉదయం 9దాటినా కనిపించని సూర్యుడు
- లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు



జోగిపేట-సంగారెడ్డి రోడ్డును కమ్మేసిన పొగమంచు

అందోల్/కొల్చారం, డిసెంబర్ 24 : రోడ్లను పొగమంచు కమ్మేసింది. ఆదివారం ఉదయం రోడ్లు మొత్తం మంచుతో కప్పేసి కశ్మీర్‌ను తలపించింది. ఉదయం 9దాటినా సూర్యుడు కనపబడలేదు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. తప్పనిసరి పరిస్థితిలో హెడ్‌లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు సాగించారు. జోగిపేట క్లాక్‌టవర్, జోగినాథాలయం, రంగనాథ ఆలయం, బస్టాండ్, కొల్చారంలో దట్టమైన పొగమంచు కమ్మేయడంతో పలువురు ఈ దృశ్యాలను సెల్ ఫోన్లలో చిత్రీకరించారు.



అందోల్: పొగమంచుతో కమ్ముకున్న జోగిపేట బస్టాండ్



కొల్చారంలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు